# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 139 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

01-04-2026 బుధవారం వెల : 1 /- పేజీలు : 4


# బలపడే అవకాశాలు ఉన్నా... వినియోగం ఎంత?

- ఎన్నికల ముందు చురుకుదనం... ఇప్పుడు జనసేన నేతలు ఎక్కడ?
- కూటమిలో భాగస్వామ్యం ఉన్నా సమస్యలపై స్పందన మందగం
- ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నా ఫీల్డ్‌లో ఫలితం ఎక్కడ?
- పంచాయతీ సమస్యలపై జనసేన చొరవ తీసుకుంటుందా?
- గ్రామీణ రహదారులపై ప్రజల ఆవేదన పెరుగుతోంది
- గ్రాస్ లెవల్‌లో నమ్మకం పెంచాల్సిన బాధ్యత
- అవకాశాలను వినియోగిస్తేనే జనసేన భవిష్యత్తు బలంగా ఉంటుంది

**నవతరం ప్రతినిధి, శ్రీకాకుళం**

రాష్ట్ర రాజకీయాల్లో ఎదగడానికి బలమైన అవకాశాలు ఉన్నప్పటికీ, జనసేన పార్టీ వాటిని ఎంతవరకు వినియోగించుకుంటుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్తంగా చురుకుదనం ప్రదర్శించిన ఆ పార్టీ నాయకులు, కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం అదే స్థాయి కార్యాచరణ కొనసాగించలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల సమయంలో ప్రజల్లోకి వెళ్లి సమస్యలు తెలుసుకున్న నాయకులు, ప్రస్తుతం స్థానిక స్థాయిలో కనిపించడం తగ్గిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కూటమిలో భాగస్వామ్యం ఉన్నప్పటికీ, సమస్యల పరిష్కారంలో జనసేన నేతల చొరవ ఆశించినంతగా లేదని ప్రజలు భావిస్తున్నారు.

రాష్ట్రంలో టీడీపీ తరువాత ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్న పార్టీగా జనసేన నిలవడం, అలాగే ఇద్దరు, ముగ్గురు మంత్రులు ఆ పార్టీకి చెందడం వంటి అంశాలు చూస్తే, ప్రభుత్వంలో ఆ పార్టీకి ఉన్న ప్రాధాన్యం స్పష్టమవుతోంది. అయితే ఈ అవకాశాలను వినియోగించి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తేనే పార్టీ బలపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రత్యేకంగా పంచాయతీ శాఖకు సంబంధించిన సమస్యలు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. ఆ శాఖను నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్యలపై దృష్టి పెట్టి, వేగంగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటే జనసేనపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగే అవకాశముంది. అదే విధంగా ఇతర శాఖల మంత్రులు కూడా తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించడంలో చురుకుదనం చూపాల్సిన అవసరం ఉంది.

శ్రీకాకుళం జిల్లాలో గ్రామీణ రహదారుల సమస్య ఇంకా కొనసాగుతూనే ఉంది. అనేక గ్రామాల ప్రజలు రోడ్ల కోసం వినతులు అందజేస్తున్నప్పటికీ, పరిష్కారంలో జాప్యం చోటుచేసుకుంటోంది. ఈ సమస్యలను జనసేన స్థానిక నాయకులు సమగ్రంగా సేకరించి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడితే గ్రామ స్థాయిలో పార్టీకి మంచి పట్టు ఏర్పడే అవకాశం ఉంది.

ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతాల్లో స్పష్టమైన అభివృద్ధి పనులు చేపడితే, ప్రజలు ఆ నాయకత్వాన్ని మళ్లీ ఆదరించే అవకాశముంది. లేదంటే అవకాశాలు ఉన్నప్పటికీ వాటిని వినియోగించుకోలేకపోతే, భవిష్యత్తులో ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఎన్నికల సమయంలో ప్రచారాల కంటే, అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారానే పదవికి న్యాయం చేసినట్లవుతుంది. అదే సమయంలో పార్టీకి దీర్ఘకాలిక లాభం కూడా చేకూరుతుంది.

జనసేన పార్టీ ఈ అవకాశాలను ఎలా మలుచుకుంటుందో చూడాల్సి ఉంది.

# చదువుకు నైపుణ్యం తోడైతే ఉత్తమ ఫలితాలు

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.
- 30 లక్షల నిధులతో ఎన్టిఆర్ మున్సిపల్ హైస్కూల్, నిమ్మాడ జెడ్పి హైస్కూల్‌లలో స్కిల్ ల్యాబ్ ఏర్పాటు.
- ఫలించిన కేంద్ర మంత్రి చొరవ.. సి.ఎస్.ఆర్ నిధులతో ల్యాబ్ ల ఏర్పాటు.
- భవిష్యత్ లో మరిన్ని పాఠశాలలకు విస్తృతపరుస్తామని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి
- తాను దత్తత తీసుకున్న ఎన్టిఆర్ స్కూల్ అభివృద్ధికి ప్రత్యేక చొరవ.

2లో



# రామ్మోహన్ నాయుడు ఎదుగుదల గర్వకారణం

- పవర్‌ఫుల్ ఇండియన్స్ జాబితాలో స్థానం
- యువ నేతగా దేశవ్యాప్తంగా గుర్తింపు
- సిక్కోలు ప్రతిష్టను పెంచిన నాయకుడు
- తెలుగుదేశం పార్టీ నాయకుడు మాదారపు వెంకటేష్

**నవతరం -శ్రీకాకుళం**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు సాధించిన విజయాలు రాష్ట్రానికి, ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాకు గర్వకారణమని ఎన్టీఆర్ మోక్షజ్ఞ సేవా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ నాయకుడు మాదారపు వెంకటేష్ తెలిపారు.

సంక్షోభాలు, అవరోధాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా కృషి చేయడం ద్వారానే రామ్మోహన్ నాయుడు ఈ స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి తన ప్రతిభను నిరూపించుకున్నారని చెప్పారు.

-మిగతా 2లో



# సచివాలయాల తనిఖీల్లో అలసత్వం వద్దు

- లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలి - జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

2లో



# అన్నదాతలను అభివృద్ధి పేరుతో మోసగించేందుకే..

- అమరావతికి చట్టబద్ధత పేరుతో బాబు డ్రామా
- ప్రజలను పక్కదారి పట్టించేందుకే అసెంబ్లీ తీర్మానం
- వైయస్సార్సీపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియా రామకృష్ణ



**నవతరం - మందస**

రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి పేరిట వేలాది ఎకరాలు సేకరించి కూటమి ప్రభుత్వం భూ కబ్జాలకు పాల్పడుతుందని, రాజధాని నిర్మాణం జరిగినట్లు ఔటర్ రింగ్ రోడ్డు కోసం అంటూ మరో 20వేల ఎకరాలు కావాలని అన్నదాతలను ప్రభుత్వం వేధిస్తుందని వైఎస్ఆర్సిపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియా రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం ఆయన -మిగతా 2లో

# ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**నవతరం -శ్రీకాకుళం**

ప్రజా సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. నందిగాం, టెక్కలి మండలాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజల నుంచి వినతులు ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా దర్బార్‌కు వచ్చిన వినతుల్లో అత్యధికంగా భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన తప్పిదాల వల్ల, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనేకమంది పేదల భూములు ఇతరుల పేర్లకు మార్పిడి అయ్యాయి. బాధితులకు న్యాయం జరిగేలా రెవెన్యూ అధికారులతో మాట్లాడి ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం -మిగతా 2లో

ఎడిటోరియల్

# బతుకులు 'బుగ్గి'పాలు!

రోజువారి చెమటోడ్చి పొట్టనింపుకునే చేతులు.. కుటుంబపోషణ కోసం ప్రయాణించిన పాదాలు.. ఒక్క క్షణంలో అగ్నికి ఆహుతైపోయాయి. ఏపీలోని మార్కాపురం దగ్గర రాయవరం సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం రవాణా వ్యవస్థలోని లోపాలను మరోసారి బహిర్గతపరిచింది. ప్రయివేటు బస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటనలో పద్నాలుగు మంది సజీవ దహనమవ్వడం తీవ్ర విషాదం. ప్రాణాలు కోల్పోయిన వారంతా కూలీలే కావడం మరీ హృదయ విదారకం. ఉన్న ఊరును, కన్నవారిని వదిలి ఉపాధి కోసం వలసొచ్చిన వారు, చివరకు కుటుంబాలనే అంధకారంలోకి నెట్టారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వాల, ప్రయివేటు యాజమాన్యాల నిర్లక్ష్యమే! ఎందుకంటే, గతేడాది కర్నూల్‌లో జరిగిన ఘటనలో ఇలాగే పందొమ్మిది మంది అసువులు బాశారు. చేవెళ్లలో టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ఇరవై మందివరకు కంకర కుప్పల్లోనే ఊపిరొదిలారు. ఇలా వరుస ఘటనలు జరుగుతున్నా అధికారులు పాఠాలు నేర్వక పోవడం విచారకరం.

తాజా ఘటనలో మృతుల వివరాలు చూస్తే సామాన్యుల దుస్థితి స్పష్టమవుతోంది. వారంతా బతుకుదెరువు కోసం ఏపీ నుంచి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు వలసొచ్చిన కూలీలు. కొందరు ఇటుకబట్టీల్లో పనిచేస్తే మరికొందరు భవన నిర్మాణరంగాల్లో స్థిరపడ్డారు. రోజూ పనిచేస్తేనే నాలుగువేళ్లూ నోట్లోకి వెళ్తాయి, లేదంటే పస్తులే. ఆస్తిపాస్తులేమీ లేవు. వచ్చే పదోపరకతోనే కుటుంబాన్ని పోషించుకుంటారు. శ్రీరామనవమి సందర్భంగా కొందరు, ఆప్తులను చూసొద్దామని మరికొం దరు సొంతూళ్లకు బయలుదేరారు. కానీ, వారి బతుకులు కన్నవారిని కలుసుకోకుండానే తెల్లారి పోయాయి.వారు ప్రయాణించిన హరేకృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేటు బస్సు కూడా పూర్తిగా వారిని అభద్రతలోకే నెట్టేసింది. బస్సుకు మరమ్మతులు చేయించాల్సి ఉన్నా పట్టించుకోలేదు. గమ్యస్థానానికి మరో మూడు గంటల సమయం ఉందనగా స్టీరింగ్ అదుపు తప్పి నేరుగా టిప్పర్ డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. వెంటనే అంటుకున్న మంటలు ప్రయాణికులను అగ్నికీలల్లో ముంచేశాయి. ఇన్ని వందల కిలోమీటర్ల మధ్య బస్సు ఫిట్‌నెస్‌ను ఒక్క అధికారి కూడా పరిశీలించక పోవడం ఇక్కడ ఆశ్చర్యకరం.

డ్రైవర్లలో ఎవరిది తప్పన్నది కాసేపు పక్కన బెడితే అమాయకులు చనిపోయారు. బాధ్యత ఎవరు వహిస్తారు? పాలకులా, ప్రయివేటు యజమానులా? కండీషన్ లేని బస్సును బయటకు తీసుకురావడం ప్రమాదానికి అసలు కారణం. అరుణాచల్‌ప్రదేశ్‌లో రిజిస్టర్ అయిన బస్సు తెలంగాణ, ఏపీల్లో తిరుగుతుంటే పర్యవేక్షించి సీజ్ చేయకపోవడం అధికారుల అలసత్వం. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావిడి చేయడమే తప్ప, ప్రమాదాలు జరగకుండా అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు పూర్తిగా శూన్యం! ప్రయివేటు ట్రావెల్స్‌కు లాభాలే ముఖ్య మన్నది తెలిసిందే. డ్రైవర్లకు సరైన విశ్రాంతి కూడా ఇవ్వడం లేదనే విమర్శలు అనేకం. ఎమర్జెన్సీ డోర్లు, ఫైర్‌సెఫ్టీ వ్యవస్థలు పనిచేయక పోవడం వంటివి కోకొల్లలు. రాత్రి ప్రయాణాల్లో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, పర్యవేక్షించే నెట్‌వర్క్ లేకపోవడం వీటికి అదనం. ఇక ఫిట్‌నెస్ తనిఖీల్లో అవినీతి, కేవలం కాగితాలపైనే పరిశీలనలు 'మామూలే'! ఇవి మన వ్యవస్థలో దాగున్న లోపాలు. చేవెళ్లలో జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కచెల్లెళ్లు చనిపోయిన ఘటన మన మనసును ఇప్పటికీ కలచివేస్తూనే ఉంది.

ఇప్పుడు ఏపీలో జరిగిన ప్రమాదంలోనూ అదే కథ. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సోదరులు ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబమే ఇప్పుడు కూలిపోయింది. ఇంకోచోట వృద్ధ తల్లిదండ్రులను చూసుకునే ఏకైక కుమారుడు మృతిచెందడంతో వారికి ఆధారమే లేకుండా పోయింది. కాగా అభంశుభం తెలియని చిన్నపిల్లలు వారి తండ్రికోసం ఎదురు చూస్తుండగా విన్న మరణవార్త వారి భవిష్యత్తునే చీకట్లోకి నెట్టేసింది. ప్రాణాలు కోల్పోయిన కూలీల కుటుంబాల రోదన మాటల్లో చెప్పలేం. 'మా వాళ్లు ఏం పాపం చేశారు? ఎందుకు మాకీశోకం?' వారి కన్నీళ్లు పాలకులపై ఇప్పుడు ప్రశ్నలుగా నిలుస్తున్నాయి. ప్రతి ప్రమాదం తర్వాత విచారణలు, పరిహారం ప్రకటనలు వస్తున్నా మూల కారణాలపై చర్యలు మాత్రం కనిపించడం లేదు. తనిఖీల్లో నిర్లక్ష్యం, ట్రాఫిక్ నియమాల అమలులో బలహీనత, ఇవే ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి. ఇలాంటివి మీడియాలో వచ్చినప్పుడో, లేదంటే మరేదైనా ఘటన జరిగినప్పుడో తప్ప మన అధికారుల స్పందన 'అంతంత' మాత్రమే! ఇకనైనా తెలుగు రాష్ట్రాల్లోని పాలకులు మేల్కోవాలి. ప్రయివేటు ట్రావెల్స్‌పై కఠిన నియంత్రణలు అమలుచేయాలి. ప్రజల ప్రాణాలు లాభాలకంటే విలువైనవని గుర్తించాలి. లేదంటే, ఇలాంటి ప్రమాదాలు పేదల జీవితాలను నిత్యం ఛిద్రం చేస్తూనే ఉంటాయి.

# సచివాలయాల తనిఖీల్లో అలసత్వం వద్దు

**నవతరం -శ్రీకాకుళం**

గ్రామ, వార్డు సచివాలయాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, క్షేత్రస్థాయి తనిఖీల్లో ఏమాత్రం అలసత్వం వహించరాదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావులతో కలిసి ఆయన వివిధ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు.

గ్రామ, వార్డు సచివాలయాల తనిఖీలకు సంబంధించి కలెక్టర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి అధికారి తమకు కేటాయించిన సచివాలయాలను క్రమం తప్పకుండా సందర్శించి, సేవలందిస్తున్న తీరును పరిశీలించాలి. రిజిస్టర్ల నిర్వహణ, బయోమెట్రిక్ హాజరు, ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలని స్పష్టం చేశారు. తనిఖీ నివేదికలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు.

**జనగణన సన్నాహాలు:**

రానున్న జనగణన ప్రక్రియపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గణన కోసం నియమించిన సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో ఎక్కడా తప్పులు దొర్లకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగాలని ఆదేశించారు. రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో మ్యుటేషన్లు, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ వేగవంతం చేయాలి. నిషేధిత జాబితా (22ఏ)లో ఉన్న భూముల సవరణలు, వెబ్‌ల్యాండ్‌లో మార్పులపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు.

జిల్లాలోని పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఇంటి పన్ను వసూళ్లను నూటికి నూరు శాతం పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోని మండలాల అధికారులు బకాయిలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, నీటి తీరువా వసూళ్లలో పురోగతి సాధించాలని, రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని సకాలంలో జమ చేయాలని సూచించారు. ఇందులో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ నుంచి పాల్గొనగా, మండలాల నుంచి తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

మొదటిపేజీ తరువాయి

జరిగేలా చేస్తామని తెలిపారు, మౌలిక సదుపాయాలకు పెద్దపీట గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇందులో భాగంగా రహదారుల నిర్మాణం, గ్రామాల్లో సీసీ రోడ్లు లేని గ్రామం ఉండకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శాఖల సమన్వయం పంచాయతీరాజ్, రహదారులు, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. వేసవి నేసథ్యంలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యత విద్య, వైద్యం మరియు ఆరోగ్య రంగాలకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని, సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శక పాలన అందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు. సమస్య ఏదైనా సరే, నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని ప్రజలకు భరోసా ఇచ్చారు.

# రామ్మోహన్ నాయుడు ఎదుగుదల గర్వకారణం

మొదటిపేజీ తరువాయి

ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకటించిన "మోస్ట్ పవర్‌ఫుల్ ఇండియన్స్" జాబితాలో 100 మందిలో 90వ స్థానం సాధించడం ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడమే కాకుండా, తెలుగుదేశం పార్టీకి, రాష్ట్రానికి, సిక్కోలు ప్రాంతానికి కీర్తి తీసుకువచ్చారని అన్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా వాటిని ప్రశాంతంగా స్వీకరించి, తన పనితీరుతోనే సమాధానం ఇస్తూ ముందుకు సాగుతున్న నాయకుడిగా ఆయన నిలిచారని కొనియాడారు. పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తూ ప్రజలకు చేరువగా ఉంటున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం, ప్రజల ఆశీస్సులతో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని రాష్ట్రం, జిల్లా, పార్టీ ప్రతిష్టను మరింత పెంచుతారని వెంకటేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# చదువుకు నైపుణ్యం తోడైతే ఉత్తమ ఫలితాలు

**నవతరం -శ్రీకాకుళం**

విద్యార్థుల చదువులకు మరిన్ని నైపుణ్యాలు అందివ్వాలనే లక్ష్యంతో కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేసిన ఓ ఆలోచన ఫలితాలను అందిస్తోంది. కేంద్ర మంత్రిగా తనకు అందుబాటులోకి వచ్చిన పరిచయాలను జిల్లా అభివృద్ధికి వినియోగిస్తున్నారు. తాజాగా పియర్సన్ ఇండియా ఎడ్యుకేషన్ సర్వీసెస్ అనే సంస్థ ప్రతినిధులు రామ్మోహన్ నాయుడుతో భేటి అవ్వడం.. వారి కార్పోరేట్ సామజిక భాద్యత నిధులు జిల్లాకు వినియోగించాల్సిందిగా రామ్మోహన్ నాయుడు కోరడం.. మంగళవారం నాడు ఈ నిధుల వినియోగంకు సంబంధించి శ్రీకాకుళం కలెక్టరేట్ కార్యాలయం నుండి పరిపాలనా ఆమోదం రావడం చకచకా జరిగిపోయాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం పియర్సన్ ఇండియా ఎడ్యుకేషన్ సర్వీసెస్ సంస్థ నుండి సి.ఎస్.ఆర్ నిధులు 30 లక్షల రూపాయలు వచ్చాయని.. వీటిని శ్రీకాకుళం నగరంలోని ఎన్.టి.ఆర్ మున్సిపల్ హైస్కూల్ తో పాటు, నిమ్మాడ జిల్లా పరిషత్ హైస్కూల్ లలో స్కిల్ ల్యాబ్ లను ఏర్పాటు చెయ్యాలని, ఒక్కో పాఠశాలలో 15 లక్షల వ్యయంతో మొత్తంగా ముప్పై లక్షలను వీటి నిర్మాణం కోసం వినియోగించాలని స్పష్టమైన ఆదేశాలను సర్వశిక్షా అభియాన్ అధికారులకు జారీ చేశారు. వీటితో పాటుగా కాగ్నో స్పేస్ అనే సంస్థ.. ఈ రెండు ల్యాబ్ ల నిర్వహణ చేస్తూ.. విద్యార్థులకు మరిన్ని నైపుణ్యాలు తోడయ్యేలా చెయ్యాలని పేర్కొన్నారు. ప్రస్తుతానికి ఈ రెండు పాఠశాలలో పైలట్ ప్రాజెక్ట్ గా ఈ స్కిల్ ల్యాబ్ లు సేవలందించనుండగా.. భవిష్యత్ లో మరిన్ని పాఠశాలలకు ఈ కాన్సెప్ట్ ను విస్తృత పరిచే ఆలోచన చేస్తున్నట్లు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

కాగా గతంలో శ్రీకాకుళం నగరంలోని ఎన్టిఆర్ మున్సిపల్ హైస్కూల్ ను పరిశీలించిన రామ్మోహన్ నాయుడు..

ఈ పాఠశాలను తాను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

ఈ నేపధ్యంలో అక్కడ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పూర్తి స్థాయి అదనపు భవనాలు, ఇతర వసతుల కోసం నిధుల మంజూరు జరగగా.. నిర్మాణ దశను అవి పూర్తి చేసుకున్నాయి. తాజాగా వాటితో పాటు స్కిల్ ల్యాబ్ సౌకర్యం కూడా అందుబాటులోకి రావడం పట్ల ఇటు ఎన్టిఆర్ మున్సిపల్ స్కూల్ విద్యార్థులు, నిమ్మాడ జెడ్పి హైస్కూల్ విద్యార్థులు ధన్యవాదాలు తెలుపుతున్నారు. దొరికిన ప్రతీ అవకాశాన్ని జిల్లా అభివృద్ధి వైపు మళ్లిస్తూఉండటంలో కేంద్ర మంత్రి చొరవ పట్ల ప్రసంశలు లభిస్తున్నాయి.

# అన్నదాతలను అభివృద్ధి పేరుతో మోసగించేందుకే..

మొదటిపేజీ తరువాయి

మందస మండలం హరిపురంలో మాట్లాడుతూ, ప్రజలు, రైతులను మభ్య పెట్టేందుకు అమరావతి రాజధాని కి చట్టబద్ధత, అసెంబ్లీలో తీర్మానం అంటూ సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ కు తెర లేపారని రామకృష్ణ విమర్శించారు. అమరావతి పేరుతో జరుగుతున్న అవినీతిపై చర్చ జరగకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకు చట్టబద్ధత పేరుతో డ్రామాకు తెర లేపేరన్నారు. అమరావతికి వైఎస్‌ఆర్సిపి వ్యతిరేకం కాదని, రాజధాని పేరుతో చేస్తున్న దోపిడీ నే వైయస్సార్సీపి ప్రశ్నిస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన తరువాత 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ ఐదేళ్లపాటు అమరావతిలో అభివృద్ధికి ఖర్చు చేసింది కేవలం రూ. 5 వేల కోట్లని , తాత్కాలిక సచివాలయం, తాత్కాలిక హైకోర్టు పేరుతో కాలయాపన చేశారని గుర్తు చేశారు. 2024 లో మళ్లీ అధికారంలోకి వచ్చాక అమరావతిలో రాజధాని అభివృద్ధి అంటూ వేల కోట్లు అప్పు చేశారన్నారు. గతంలోనే రాజధాని కోసం 50 వేల ఎకరాలు సేకరించారని, మళ్లీ ఇప్పుడు 25 వేల ఎకరాలు సేకరిస్తున్నారని, ఇంత భూమి ఎందుకని వైఎస్‌ఆర్సిపి ప్రశ్నకు కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. 2028 లోపు అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని చెబుతున్న చంద్రబాబు .. అదే సమయంలో ఎవరైనా మార్చేస్తారంటూ ప్రచారం చేయడం వెనక ఆంతర్యం ఏమిటో చెప్పాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. అమరావతి పేరిట భూములు ఇచ్చిన రైతులు పరిస్థితి నేడు దారుణంగా ఉందని, ప్లాట్లు డెవలప్మెంట్ లేదని, రోడ్లు వేయలేదని, కొన్ని ప్లాట్లు చెరువులో ఉన్నాయని, చంద్రబాబును మరోసారి నమ్మే స్థితిలో రాజధాని ప్రాంత రైతులు లేరని ఆయన అన్నారు. మొదటి దశలో 50 వేల ఎకరాలు భూ సేకరణ చేశారని, ఒక్కో ఎకరా అభివృద్ధికి రెండు కోట్ల రూపాయలు చొప్పున లక్ష కోట్లు అవసరం అన్నారని, మరోసారి సెల్ఫ్ ఫైనాన్స్ రాజధాని అన్నారని.. ఇప్పుడు రెండవ దశలో మరో 25 నుంచి 30 వేల ఎకరాలు భూసేకరణకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ భూముల అభివృద్ధికి మరో 50 వేల కోట్ల రూపాయలు అవసరం కాగా.. ఈ భారం అంతా రాష్ట్ర ప్రజలు భరించే స్థితిలో ఉన్నారా? అని ప్రశ్నించారు. కేవలం రాజధాని అమరావతి అంటూ కూటమి ప్రభుత్వ పెద్దలు కాలక్షేపం చేస్తూ.. రాష్ట్ర సమస్యలను గాలికి వదిలేసారని ఆయన విమర్శించారు. సెల్ఫ్ ఫైనాన్స్ రాజధాని అంటూ అసత్య ప్రచారాలు చేశారని, సెల్ఫ్ ఫైనాన్స్ అయితే రూ. 47 వేల కోట్లు అప్పులు ఎందుకు చేశారో చెప్పాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటుందని, పాలనలో వైఫల్యంతో టిడిపి నేతల్లోనే నైరాశ్యం నెలకొందని, పాలన వైఫల్యాలనుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు, రైతులను మభ్య పెట్టేందుకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఊతమివ్వాలనే ఉద్దేశంతోనే రాజధానికి చట్టబద్ధత అంశాన్ని హడావుడిగా తెరపైకి తెచ్చారని రామకృష్ణ విమర్శించారు. అదే తరహాలో మూలపేట పోర్టు పనులు ఇంకా 30 శాతం పూర్తి కావలసి ఉన్నప్పటికీ, అవి పూర్తి చేయకుండా అదనంగా పోర్టు పేరుతో కొంత భూమిని రైతాంగం నుంచి సేకరించి, కార్పొరేట్ సంస్థల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించేందుకు ఈ ప్రాంత టిడిపి ప్రజా ప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో వైయస్సార్సీపి ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందనిఆయన స్పష్టం చేశారు.

# నేత్రదానం "శ్రేష్ఠ దానం"

**- రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు**

**నవతరం -శ్రీకాకుళం**



"నేత్రదానం" శ్రేష్ఠ దానమని, రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక కాకి వీధికి చెందిన గంధం.సరోజని 80 సంవత్సరాలు, తనువుచాలించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ నేత్ర దానం అనేది ఒక నష్టాన్ని అమూల్యమైన కానుకగా మార్చి, ఒక వ్యక్తి ప్రపంచాన్ని మళ్ళీ చూసేలా చేసే ఒక సురక్షితమైన, ప్రభావవంతమైన మార్గమని, నేత్రదానం మహాదానమన్నారు. గంధం.సరోజని కుటుంబ సభ్యులు నేత్ర దానం చేయాలనుకోవటం ఆనందదాయకమని, కొడుకు గంధం.సాగర్ కుమార్, గోవింద రాజులు, పి.కుమార్ లకు, రెడ్ క్రాస్ ప్రతినిధి నేత్రదాన ప్రేరేపకులు కొల్లు.సత్యనారాయణకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. నేత్ర సేకరణలో భాగముగా మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి.సుజాత, సహాయకులు నంది . ఉమాశంకర్ ద్వారా ఆమె కార్నియాలు సేకరించి, విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారన్నారు. సహకరించిన కుటుంబ సభ్యులకు పేరు పేరునా కృతజ్ఞతలని, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, కోశాధికారి కె.దుర్గా శ్రీనివాస్, ఇతర సభ్యులు అభినందించారు. నేత్రదానం పై అవగాహన, చైతన్యం ప్రజల్లో పెరుగుతుందని, రానున్న రోజులలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామని, ఈ విధంగా నేత్రదానం ద్వారా మరొకరికి ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం కలుగుతుందని, అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత,ప్రజలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేత్ర దానం చేయాలనుకునే వారు 78426 99321 నంబరుకు సంప్రదించాలన్నారు.

# పుడమిపై వారికి పునర్జన్మే..!



మాట్లాడుతూనే అలా మాయమౌతారు...

కన్నుమూసిన తర్వాత కార్చే ఆ
"కన్నీటిబొట్లు" వారి కళ్ళకు కనిపించవు..!
"ఆత్మశాంతి కలుగుగాక" అన్న ఆ కన్నీటి
"ప్రార్థనలు వారి చెవులకు వినిపించవు...!

బ్రతికుండగా పిల్లలు పంచే
స్వచ్ఛమైన ప్రేమను ఆస్వాదిస్తూ
అస్తమించడం ఒక అదృష్టమే...!

తల్లిదండ్రులను ఆదరించడం
ఆప్యాయంగా ఆలింగనం చేసుకోవడం
మనిషితనానికి మానవత్వానికి
మంచితనానికి ప్రతిబింబం...!

ఆ వృద్ధ జంట బ్రతికుండగానే...
ఒక "ప్రేమపూర్వక పలకరింపు"
వారికి ప్రాణవాయువై చేరుతుంది...
ఒక "ఆత్మీయ ఆలింగనం"
వారికి స్వర్గస్పర్శను అందిస్తుంది...!

ప్రక్కనే కూర్చొని...
చేతిలో చెయ్యేసి...
కళ్లలో కళ్లుపెట్టి...
నవ్వుతూ నమ్మకంగా
మనసారా మాట్లాడితే...
"పుడమిపై అది వారికి పునర్జన్మే"...!

ఏ ఆధారంలేక నడవలేని...
వినలేని...కోరింది కొనలేని...
తినలేని...కంటిచూపు ఆనని...
కాటికి కాళ్ళు చాపుకున్న ఆ వృద్ధులు
"రెక్కలు విరిగిన పక్షులే"...
"ఎండిన పండుటాకులే"...!

మీ ప్రేమ కోసం
కొండంత ఆశతో ఎదురుచూస్తూ
ఏదో ఒక రోజు నిశ్శబ్దంగా
నింగిలోకి నిశీధిలోకి నిష్క్రమిస్తారు

ఓ కన్నబిడ్డలారా...!
ఒక్క క్షణం ఆలోచించండి...!
"అమ్మానాన్నలే ప్రత్యక్ష దైవాలన్నది"
ఒక పచ్చి నిజం...మరువకండి..!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# "అక్షరాల అగ్ని"
## ("కలం చేతిలో ఉన్న కవి" కథ...")



ఒక చిన్న పట్టణంలో రాఘవ్ అనే
యువకుడు ఉండేవాడు. బయటికి చూస్తే
అతను సాధారణ వ్యక్తిలా కనిపించేవాడు.
కానీ అతని లోపల ఒక అగ్ని దాగి
ఉండేది... అది మాటల అగ్ని, అక్షరాల శక్తి.

రాఘవ్ ఒక కవి.
అతను కవిత్వం రాయడం అంటే కేవలం
అలంకారాలు కాదు...
అది అతనికి ఒక ఆయుధం.

ఒక రోజు పట్టణంలో ఒక సంఘటన
జరిగింది.
పేదవాడి హక్కులు కొందరు పెద్దమనుషులు
తినేస్తున్నారు.
అందరూ చూస్తున్నారు... కానీ ఎవ్వరూ
మాట్లాడటం లేదు.

అప్పుడు రాఘవ్ తన కలం పట్టాడు.

"గుట్టంతా రట్టు చేస్తాను" అన్నట్టుగా
అతను రాసిన ప్రతి పదం నిజాలను
బయటపెట్టింది.
పెద్దమనుషుల దుర్మార్గాలు ఒక్కొక్కటిగా
వెలుగులోకి వచ్చాయి.

మరో రోజు...
ఒక కుటుంబం ఆకలితో బాధపడుతోంది.
ఎవరికీ కనిపించని ఆ బాధను
రాఘవ్ తన కవితలో చూపించాడు.

"కడుపులో పేగుల్ని లెక్కపెడతాను"
అన్నట్టుగా
అతని పదాలు ఆకలి
అరుపుల్ని వినిపించాయి.

కొంతమంది దుర్మార్గులు
అతన్ని ఆపడానికి
ప్రయత్నించారు.
"రాయకూడదు" అని హెచ్చరించారు.

అప్పుడు రాఘవ్ నవ్వాడు...
"కలంతోనే శత్రువుల్ని ఖతం చేస్తాను"
అన్నట్టుగా
అతను ఇంకాస్త గట్టిగా రాయడం
ప్రారంభించాడు.
అతని అక్షరాలు వారి అహంకారాన్ని ఛిద్రం
చేశాయి.
మానవత్వాన్ని మర్చిపోయినవారికి
అతని కవితలు ఒక "మరణశాసనం" లా
మారాయి.
శబ్దం లేకుండా... కానీ గుండెల్లోకి
దూసుకెళ్లేలా.

కానీ రాఘవ్ కేవలం కోపం కాదు...
అతని మనసులో ప్రేమ కూడా ఉంది.

పచ్చని చెట్లను చూసి కవితలు రాసేవాడు...
బాధలో ఉన్నవారిని చూసి ఆశ
నింపేవాడు...
మోడువారిన జీవితాల్లో కొత్త చిగుర్లు
తొడిగించేవాడు.

ఒక రోజు అతని దగ్గరకు ఒక బాలుడు
వచ్చాడు.
"అన్నా... నీలా నేనూ కవి కావాలి. ఎలా?"
అని అడిగాడు.

రాఘవ్ చిరునవ్వు చిందించాడు.
"కవిగా మారాలంటే...
ముందు మనసు మనిషిగా మారాలి.
కలం ఆయుధం కాదు... అది బాధ్యత"
అన్నాడు.

ఆ రోజు నుంచి ఆ బాలుడి చేతిలో కూడా
ఒక కలం వచ్చింది...
కానీ అది కేవలం రాయడానికి కాదు...
సమాజాన్ని మార్చడానికి.

? ముగింపు సందేశం:

కవి అంటే కేవలం పదాలు రాసేవాడు
కాదు...
అతను సమాజానికి అద్దం పట్టేవాడు...
అవసరమైతే అక్షరాలతో యుద్ధం చేసే
యోధుడు.

రచన: తేరాల రాజేందర్ ప్రసాద్ గుప్తా
మీసేవ బాబు జగ్జీవన్ రామ్ నగర్
- హైదరాబాద్ 500037
చరవాణి: 9297109223

# ఒంటిమిట్టలో....వెన్నెలవేళ
# సీతారాముల కల్యాణ వైభోగం



దాడులు తట్టుకొని నిలబడింది ఒంటిమిట్ట కోదండ రామాలయం. దీనికి ఏకశిలా నగరం అని కూడా పేరు సీతారామ లక్ష్మణుల ప్రతిరూపాలను ఒకేషులలో విగ్రహంగా చెక్కినందు వల్లే ఏకశిలా నగరం అనే పేరు వచ్చింది. శతాబ్దాలుగా ఒంటిమిట్ట రామాలయం భక్తులకు పుణ్యతీర్థంగా ఉంది.

విజయనగర రాజుల కళావైభవానికి ప్రతీకగా నిలుస్తూ ఎన్నో విశిష్టతలను సంతరించుకున్న పురాతన ఆధ్యాత్మిక క్షేత్రం ఒంటిమిట్ట రామాలయం. కడప జిల్లాలో కొలువుదీరిన ఈ కోదండ రామాలయం హంపి ప్రాంత శిల్పకళతో అల రారుతోంది. సువిశాల ప్రాంగణం, మూడు ఎత్తయిన గోపురాలు, 160 అడుగుల గాలిగోపురం, 32 స్తంభాల ముఖమండలం, ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మ ణులు ఇక్కడి ప్రత్యేకతలు. రామభక్తాగ్రేసరుడైన హనుమంతుడి విగ్రహం. మాత్రం ఇక్కడ లేకపోవడం విశేషం.

దేశవ్యాప్తంగా ఉన్న రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి అయితే వీటన్నింటి కన్నా ఒంటిమిట్ట చాలా ప్రత్యేక. సాధారణంగా దేశవ్యాప్తంగా వైష్ణవ ఆలయాల్లో సీతారాముల కళ్యాణం చైత్రమాసం నవమి రోజు పగలు జరిగితే ఒంటిమిట్టలో మాత్రం చైత్ర పౌర్ణమి రోజు వెన్నెల్లో జరుగుతుంది ఆంధ్ర భద్రాద్రిగా పేరుగాంచిన ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణ వేడుక చూసేందుకు రెండు కళ్ళు చాలవు. 11వ శతాబ్దం నుంచి ఒంటిమిట్టలో కోదండరాముడికి పూజలు నిర్వహించినట్లు తెలుస్తోంది.

జాంబవంతుడు ఎక్కడ ఒక కొండపై ఆశ్రమం నిర్మించి రామ తారక మంత్రాన్ని జపిస్తూ తపస్సు చేశాడట జాంబవంతుడికి ఎదురుగా ఉన్న మరో గుట్టమీద నుంచి రఘురాముడు దివ్యదర్శనం ఇచ్చి వరాలు ప్రసాదించాడట జాంబవంతుడు శ్రీరామచంద్రునిపై భక్తితో సీతారామ లక్ష్మణ మూర్తులను ఒకేషులపై మలచి ఇక్కడ ప్రతిష్టించినట్టు స్థల పురాణం. ఇది రాముడు నడయాడిన నేల ప్రకృతి వైపరీత్యాలు దొంగతనాలు

ఆంజనేయుడు లేని రామాలయం :
రామాలయం లేని ఊరూ రామాయణం వినని వారూ ఉండరంటారు. దేశంలో ఏ రామాలయం దర్శించినా రాముడి కుడివైపు లక్ష్మణుడు, ఎడమవైపు సీతాదేవి, పాదాల దగ్గర నమస్కార భంగిమలో హనుమంతుడి విగ్రహాలు దర్శనమిస్తాయి. కానీ ఈ ఆలయంలో ఆంజనేయుడి విగ్రహం ఉండదు. అలాంటి అరుదైన ఆలయమే ఒంటిమిట్ట రామాలయం. ప్రతి రామాలయం లోనూ కనిపించే ఆంజనేయ స్వామి విగ్రహం ఈ ఆలయంలో కానరాకపోవడం మరో ప్రత్యేకత. రాముల వారు ఆంజనేయుని కలవక ముందే ఇక్కడకు వచ్చారనీ, అందుకే ఇక్కడ హనుమంతుని విగ్రహం ఉండదని చెబుతారు.

### ఒంటిమిట్ట ఆలయ చరిత్ర:

బుక్కరాయల కాలంలో 1356లో ఒంటిమిట్ట వద్ద తుంగభద్ర నదీ తీరాన శ్రీసీతారామలక్ష్మణుల విగ్రహాలు ప్రతిష్ఠించినట్లు శిలాశాసనాల ద్వారా తెలుస్తోంది. ఇక్కడి శిల్పసంపద 11వ శతాబ్దం నాటి కళాకృతులను పోలి ఉంటుంది. ఆలయ గోపుర నిర్మాణం చోళరాజుల సంప్రదాయాలకు దర్పణం పడుతుంది. ఆల యంలో రెండు శాసనాలు 16వ శతాబ్దం నాటి విజయనగర ప్రభువులు సదాశివ రాయలు వేయించినట్లు తెలుస్తోంది. ఈ ఆలయ విశిష్టతను చాటే చారిత్రక కథ నాలెన్నో ప్రచారంలో ఉన్నాయి. త్రేతాయుగంలో సీతారాములు ఈ ప్రాంతంలో సంచరించారని పెద్దలు చెబుతుంటారు. ఆ సమయంలో ఈ ప్రాంతంలో ఒంటోడు, మిట్టోడు అనే ఇద్దరు అన్నదమ్ములు దారిదోపిడీలకు పాల్పడే వారు. ఒక రోజు ఈ ఇద్దరూ తనకు తారసపడగా బాటసారులను దోచుకోవడం, హత్యలు చేయడం మహా పాపం గనుక ఆ అకృత్యాలకు స్వస్తి చెప్పాల్సిందిగా రాముల వారు హితబోధ చేశారు. శ్రీరాముడి ఉపదేశంతో దోపిడీలకు స్వస్తి పలికిన ఒంటోడు, మిట్టోడు ఈ ప్రాంతంలో కోదండ రామాలయం నిర్మించారు. కాలగతిలో ఈ ప్రాంతం ఆ సోదరుల పేరిట 'ఒంటిమిట్ట'గా మారిందని చారిత్రక కథనం.

### జాంబవంతుడు నిద్రించిన శిల

ఒంటిమిట్ట ఆలయానికి సంబంధించి మరో కథనం కూడా ప్రచారంలో ఉంది. రావణాసురుడు సీతమ్మ వారిని అపహరించిన తర్వాత ఆమె కోసం అన్వేషిస్తున్న జాంబవంతుడు ఈ ప్రాంతంలో రాత్రి వేళ ఓ శిలపై నిద్రించాడట. మరుసటి రోజు ఉదయం లేచి చూసిన అతడికి ఆ శిలపై సీతారామలక్ష్మణుల రూపాలు కనిపించాయట. ఆ శిలపై వెలసిన శ్రీసీతారామలక్ష్మణులకు విజయనగర ప్రభువులు గుడి కట్టించా రని పెద్దలు చెబుతుంటారు.

### బిచ్చమెత్తుకుని ఆలయ నిర్మాణం

భద్రాచలంలో కంచర్ల గోపన్న (రామదాసు) రాముడికి ఆలయాన్ని నిర్మించి నట్లే ఒంటిమిట్టలో కోదండ రామాలయం రూపుదాల్చేందుకు వావిలికొలను సుబ్బారావు అనే వ్యక్తి దీక్ష వహించి చరిత్రలో నిలిచిపోయారు. జమ్మలమడు గులో రెవెన్యూ శాఖలో పనిచేసిన సుబ్బారావు ఒంటిమిట్టకు చేరుకుని గోచీ ధరించి, టెంకాయ చిప్ప చేత పట్టుకుని బిచ్చమెత్తుకుని ఆలయం నిర్మించారు. కోట్ల విలువ చేసే భూములు బంగారు వెంటే ఆభరణాలు ఇతర స్థిరచరాస్తులను ఆలయ నిర్మాణానికి వెచ్చించారు.

### ఎందరో మహానుభావులు...

ఎంతోమంది మహానుభావులు ఒంటిమిట్ట కోదండరాముని దర్శించి పునీతు లయ్యారు. వీరిలో బమ్మెర పోతానామాత్యులు ప్రసిద్ధులు. పోతన ఒంటిమిట్టవా సిగా ప్రసిద్ధికెక్కారు. పోతన ఒంటిమిట్టలో ఉంటూ మహాభాగవతం రచించి రామునికే అంకితమిచ్చారు. గజేంద్రమోక్షం రచించే సమయంలో అల వైకుంఠ పురి అనే పద్యంలో కొన్ని చరణాలు గుర్తుకు రాక పోతన నిలిపివేయగా రామ చంద్రుడే స్వయంగా ఆ పద్యాలను పూర్తి చేసినట్లు పురాణాల ద్వారా తెలు స్తోంది. అదే విధంగా తాళ్లపాక అన్నమాచార్యులు స్వామి భక్తులు. నిత్యం ఒంటిమిట్ట కోదండరాముని దర్శించుకుని తన గానామృతంతో స్వామిని వేనోళ్ల కీర్తించేవారు. అలాగే ఇమాంబేగ్ అనే నవాబు స్వామివారి అభిషేకం కోసం ఆల యంలో బావి తవ్వించారు. భిన్నత్వంలో ఏకత్వానికి తార్కాణంగా నిలిచిన బావిని నేటికీ మనం ఇక్కడ చూడవచ్చు. అదే విధంగా భవనాసి మాల ఓబన్న అనే భక్తుడు స్వామివారిని దర్శించి పునీతుడ య్యారు.

### మాల ఓబన్న కథ

అన్ని కులాలు సమానమేనని, అంటరాని వారెవరూ లేరని కోదండరాముడే స్వయంగా తెలిపాడనడానికి బవవాసి మాల ఓబన్ని ఉదంతమే ప్రత్యక్ష ఉదాహరణ. శ్రీరామదాసు, భక్త కబీర్లలాగే మాల ఓబన్న కూడా రామభక్తుడు. దేవస్థానం ముఖద్వారం వద్ద కూర్చొని భజనలు చేస్తుండగా, గ్రామ పెద్దలు, పురోహితులు అతనిని అంటరాని వాడిగా భావించి ఓబన్నకు దేవస్థానం పడమటి వైపు తోసేస్తారు. పూజాం లు స్వామివారికి పూజ చేసేందుకు దేవాలయ గర్భగుడి తలుపులు తెరవగా మూల విరాట్లు పడమర వైపుకు తిరిగి ఉంటాయి. తమ తప్పు ను గ్రహించి ఓబన్నను తిరిగి తూర్పు వైపునకు తీసుకువచ్చి భజనలు చేయగా మూల విరాట్లు యధాస్థానానికి చేరుకున్నాయి. దీనిని బట్టి మతసామరస్యానికి దేవాలయం ప్రతీకగా చెప్పబడుతోంది. మరి ఈసారి పాత సాంప్రదాయాన్నే కొనసాగిస్తారా లేక మార్పు ఉంటుందా? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఆదిశేషుని తల భాగం తిరుమల నడుమ వైష్ణవ దేవాలయాలుగా దేవుని కడప, ఒంటిమిట్ట, ఆహోబిలం. తోక భాగంలో శ్రీశైలం. అటు తిరుమలకు, ఇటు శ్రీశైలంనకు మధ్యభాగంలో ఉండడం వలన దీనికి శ్రీమ దొంటిమిట్ట అని కూడా అంటారు. అందువలనే దేవుని కడప సందర్శించి తిరుములకు వెళ్లే భక్తులు ఈ దేవాలయాన్ని సందర్శించడం ఎంతో పుణ్యంగా భావిస్తారు. పౌర్ణమికి ముందు చతుర్దశి రోజున రాత్రి వేళలో కోదండ రామస్వామి బ్రహ్మోత్స వాల్లో భాగంగా కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అంతేకాకుండా రామయ్యకు సేవ చేస్తానని ఆనాటినుండిస్వామివారి కళ్యాణానికి తానుకూడా ఉడతా భక్తిగా ప్రభుత్వ తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు ప్రతి సంవత్సరం పంపే విధంగా శాసనం చేసి ఆయనే స్వయంగా స్వామివారి కళ్యాణానికి విచ్చేసి మత సామరస్యానికి నాంది పలికారు. ఆ శాసనం ప్రకారం ఈనాటికి ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు ప్రభుత్వం ద్వారా అందించడం ఆనవాయితీగా వస్తుంది. సీతారాముల కళ్యాణం ఉత్సవాన్ని తిలకించేందుకు లక్షలాదిమంది భక్తులు విచ్చేస్తారని భావిస్తున్నారు.

పున్నమి రాత్రి జరిగే శాస్త్రోక్తకంగా స్వామివారి కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

వ్యాసకర్త
ఆధ్యాత్మిక
సాహిత్య
వ్యాసభూషణ్,
ఆధ్యాత్మిక
సాహిత్య
సామ్రాట్
కావ్యసుధ,
హైదరాబాద్,
సెల్ 92473 13488



# నారసింహా..సిపిఎస్ రద్దు చేయవయ్యా..!

- భాగస్వామ్య పింఛను పథకం రద్దు కోసం నరసింహుడికి ప్రత్యేక పూజలు
- ఏ ఐ ఎన్ పి ఎస్ ఈ ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాచన రఘునందన్



భాగస్వామ్య పింఛను పథకం రద్దు కావాలన్న తమ అభిమతం నెరవేరాలని కోరుతూ..ఎల్లమ్మ తల్లి కి ప్రత్యేక పూజలు చేసినట్టు ఆల్ ఇండియా న్యూ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏ ఐ ఎన్ పి ఎస్ ఈ ఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి మాచన రఘునందన్ చెప్పారు.మంగళ వారం నాడు ఆయన ఒక్క రోజు పర్యాటన నిమిత్తం విశాఖ వచ్చారు.సింహాచలం ఆలయం లో సి పి ఎస్ రద్దు కోసం ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. పాలకులు ఎప్పటికప్పుడు సి పి ఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారే తప్ప..ఆ తర్వాత "భాగస్వామ్య పింఛను పథకం రద్దు చేస్తాం అని హామీ ఇచ్చాశీ" అన్న విషయమే మరచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ తో నే ఉద్యోగుల ఆర్థిక, సామాజిక భద్రత అన్న విషయం వారికి పట్టడం లేదని రఘునందన్ అన్నారు.దేశ వ్యాప్తంగా కోటి మంది కి పైగా ఉద్యోగులు న్యూ పెన్షన్ స్కీమ్ వద్దు అని దైవాన్ని దీనంగా ప్రార్థిస్తున్నామని రఘునందన్ వివరించారు. పాలకులకు సి పి ఎస్ రద్దు చేసేలా..పాత పెన్షన్ పథకం ను పునఃరుద్దరించేలా బుద్ధి ప్రసాదించాలని కోరుతూ..దేవుళ్ళకు,దేవతలకు పూజలు చేస్తున్నామని రఘునందన్ వివరించారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరం

## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**నవతరం -శ్రీకాకుళం**

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, ఫలితాలు వెల్లడించడం నేరమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. గర్భస్థ పూర్వ, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ సలహా మండలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగగా కలెక్టర్ వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల జననాలు తక్కువ నమోదవుతున్న మండలాల్లో స్కానింగ్ సెంటర్లపై మరింత పర్యవేక్షణ చేస్తూ,ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రతి స్కానింగ్ సెంటర్ ఫారం ఎఫ్ తప్పకుండా ఆన్లైన్లో అప్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాల బాలికలు ఇద్దరూ సమానమేనని, ఆడపిల్లలు పుట్టడం ఒక వరమని ప్రతి ఒక్కరూ గ్రహించాలని చెప్పారు.

పి.సి అండ్ పి.ఎన్.డి.టి చట్టం పై అవగాహన కల్పించండి

జిల్లా న్యాయ సేవాదికార సంస్థ సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జి హరిబాబుమాట్లాడుతూ జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో ఈ చట్టం పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అన్ని లైన్ డిపార్ట్మెంట్ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని గ్రామీణ ప్రాంతాల్లో కూడా అవగాహన కల్పించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోమని ఎవరైనా బలవంతం చేసినా, ఆడపిల్ల పుట్టిందని వివక్షకు గురిచేసిన వారు డి ఎల్ ఎస్ ఎ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేస్తే వారికి న్యాయ సహాయము సలహా అంజేయబడుతుందని తెలిపారు.
డి ఎం హెచ్ ఓ డాక్టర్ కె . అనిత మాట్లాడుతూ జిల్లాలో 138 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో 29 ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్నట్లు తెలిపారు. స్కానింగ్ కేంద్రాలులో అన్నిచోట్ల జరుగుతున్న ప్రక్రియను పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు తప్పనిసరిగా అమలుజరుగుచున్నట్లు తెలిపారు. ఈ చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరంగా చర్యలు ,3 నుండి 5 సంవత్సరాలు జైలు శిక్ష ఉంటుందని వివరించారు.
అవగాహన లేమి కూడా స్త్రీ, పురుష జనాభా నిష్పత్తిలో పెద్ద ఎత్తున తేడాలు రావడానికి కారణమన్నారు. డివిజన్ మండల స్థాయిలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలలో ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు భాగస్వాములు చేస్తున్నట్లు తెలిపారు.
ఎయిడ్స్ పై అనంతరం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. హెచ్ ఐ వి నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్క్ గ్రూపులు తరచు పరీక్షలు నిర్వహిస్తూ ముందస్తు నివారణా చర్యల్లో భాగంగా వారికి అవగాహన కల్పించాలని, ప్రచార కార్యక్రమాలైన జానపద కళాజాతలు, వివిధ ప్రచార కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలని కలెక్టర్ స్వప్నిల్ ఆదేశించారు.ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవి సోకిన వారికి చికిత్స కొరకు మూడు ఏంటి రిట్రో వైరల్ థెరఫీ సెంటర్స్ అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా 13 రక్త నిల్వ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష పాటిస్తే జిల్లాలోని మూడు ఏ.ఆర్.టి సెంటర్లు లో గల ఫిర్యాదు బాక్సులలో తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చని అదేవిధంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు డిఎంహెచ్వో టి. శ్రీకాంత్, డిప్యూటి డి ఎం ఎచ్ ఓ మేరీ కేథరిన్, డిఐఓ రామదాసు, వైద్యాధికారులు,వివిధ ఎన్జీవో సంఘాల ప్రతినిధులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి శబలా భోజనాల సంబరాలు



- ఏప్రిల్ 1 నుండి 5 తేది వరకూ నిర్వహించె శబల భోజనాలనం జయప్రదం చేయండి
- మిల్లెట్స్ రాంబాబు

**నవతరం-విశాఖపట్నం**

శబల భోజనాలను జయప్రదం చేయండి అని మిల్లెట్స్ రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం విశాఖపట్నం లోని సింహాచలం కొత్త గోశాల వద్ద శబల భోజనాల పండుగ గురించి సేవ్ సంస్థ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవ్ సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజులు పాటు ఉచితంగా నిర్వహించె శబల భోజనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు గాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేసాం అని అన్నారు.
ఈ కార్యక్రమంలో సేవ్ సంస్థ కో ఆర్డినేటర్ సురేంద్రనాద్ మాట్లాడుతూ ఈ శబల భోజనాలు పండుగను జయప్రదం చేయాలని కోరారు.
వేలాది మంది ఈ భోజనాలు పండుగను, వివిధ ఉత్తరాంధ్ర కళ రూపాలు ప్రదర్శన, సంప్రదాయ చేతి వృత్తుల ప్రదర్శన, చెక్క గానుగ, ఆర్గానిక్ విత్తనాలు, ఉత్పత్తుల స్టాల్స్ వివిధ కార్యక్రమలను జయప్రదం చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఎపి నర్సరీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల చలపతి రావు, తులసి నేచురల్స్ సత్యనారాయణ, ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు డా' ఎం.అర్.ఎన్.వర్మ , ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షులు వర్మ, మేంగొ మేన్ అప్పాజీ, గ్రీన్ క్లైమేట్ టీం కార్యదర్శి జె.వి రత్నం తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నాయకులు రాజకీయ మనుగడ కోసమే నిన్నటి సభ

## ఏఎంసి చైర్మన్ బగాది శేషగిరిరావు




**నవతరం టెక్కలి**

టెక్కలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ ఉగాది శేషగిరిరావు ఆధ్వర్యంలో పత్రిక విలేకరుల సమావేశం జరిపారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ప్రజలను తప్పుద్రోవ పట్టించడానికే పోర్టుకు పోదాం రండి అనే కార్యక్రమంను వైసీపీ నాయకులు చేపట్టారని అన్నారు. వైసిపి నాయకులు రాజకీయ మనుగడ కాపాడుకోవడం కోసమే నిన్నటి సభ ద్వారా నోటికొచ్చిన అసత్యాలు మాట్లాడుతున్నారనీ,గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో భావనపాడు పోర్టుగా నారాచంద్రబాబు నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు ,రామ్మోహన్ నాయుడు అన్ని అనుమతులు తీసుకొని రావడం జరిగిందిఅని 2019 వ సంవత్సరంలో ప్రభుత్వం మారిన తర్వాత భావనపాడు పోర్టును మూలపేట పోర్టు గా మార్చారనీ
మళ్లీ కూటమి ప్రభుత్వం 2024వ సంవత్సరంలో ఏర్పడ్డాక అభివృద్ధికి ఆటంకం కలగకూడదని 20 శాతం పనులు చేసిన పోర్టును ఈ 19 నెలల కాలంలో అచ్చెన్నాయుడు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక శ్రద్ధ పెట్టి 80 శాతం పనులు పూర్తిచేసి షిప్ ను ట్రైల్ రన్ చేయడం జరిగింది.అన్నారు.
అచ్చెన్నాయుడు పోర్టు రోడ్డును పరిశీలించి పంట పొలాలకు కావలసిన కాలువలను బాక్సులను నిర్మాణం చేపట్టడం జరిగిందనీ అన్నారు. గత ప్రభుత్వం జాప్యము వలనఈరోజు పోర్టు రోడ్డు కనెక్టివిటీ లేకపోవడంతో కోటబొమ్మాలి టెక్కలి రహదారుల ద్వారా పోర్టు లారీలు ప్రయాణించి ఎంతోమంది ప్రాణాలను కోల్పోయారనీ తెలిపారు. టెక్కలిని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలని పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారనీ,
టెక్కలి నియోజకవర్గానికి 614 కోట్లతో మంచినీటి పథకాన్ని తీసుకొని వచ్చి దాహార్తిని తీర్చినవారు మా నాయకుడు అని తెలిపారు.ఏదో
ఆయన మౌనంగా ఉన్నారని అవాకులు చవాకులు ఆయన మీద మాట్లాడితే ఊరుకునేది లేదు.
దమ్ముంటే 2019 నుంచి 2024 మధ్య మీరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ఏమిటో చెప్పండి.
ఎం పి రామ్మోహన్ నాయుడు కోసం మాట్లాడే అర్హత శ్రీకాకుళం లోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ వైసీపీ నాయకుడికి లేదు.
ఆయన కేంద్ర మంత్రిగా ప్రోటోకాల్ పరంగా తొమ్మిదవ స్థానంలో ఉన్నారు ఆయనకు విమర్శించే ముందు అది మీరు ముందుగా తెలుసుకోండి.ఆయన చొరవతోనే 385 ఎకరాల సాల్ట్ ల్యాండ్ 99 సంవత్సరాలకు లీజుకు తీసుకురావడం వలన ఈరోజు పోర్టు రహదారి వేగవంతానికి సహకారం అయింది. ముఖ్యంగా వైసీపీ నాయకులకు మా సవాల్ మీరు మీ ప్రభుత్వ హయాంలో పోర్టుకు కొబ్బరికాయ కొట్టిన తర్వాత మీరు ఎంత శాతం పనులు చేశారు మేం అధికారంలోకి వచ్చాక మేము ఎంత శాతం పనులు చేసామో టెక్కిలి అంబేద్కర్ కూడలి లో చర్చించుకుందాం దానికి మీరు సిద్ధమా. అని సవాల్ విసిరారు.ఈ కార్యక్రమం లో హనుమంతు రామకృష్ణ, మామిడి రాము,పోలాకి షణ్ముఖ్ రావు, ఇప్పిలి జగదీష్,రెయ్యి ప్రీతీష్ చంద్ర, దల్లి ప్రసాద్ రెడ్డి, కోళ్ల కామేష్, గండి సూర్యనారాయణ, ధోని బుజ్జి,ధవల శ్రీను, వట్టికుల్ల రామకృష్ణ, సోడిముడి కిరణ్ మరియు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రగతి పథంలో మందస పంచాయతీ

## సర్వతో ముఖాభివృద్ధికి కృషి



**నవతరం-మందస**

తన ఐదు సంవత్సరాలు పాలన కాలంలో మందస మేజరు పంచాయతీ సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయడం జరిగిందని అభివృద్ధి పథంలో మందస పంచాయతీని నడిపించడం జరిగిందని మందస మేజర్ పంచాయతీ సర్పంచ్ చెరుకుపల్లి ఎల్లమ్మ లక్ష్మణరావు అన్నారు ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు వైసిపి ప్రభుత్వ పాలనలో మాజీ మంత్రి డాక్టర్ ఎస్ అప్పలరాజు కృషితో మందస మేజరు పంచాయతీలో సుమారు 10 కోట్లు రూపాయల వ్యయంతో ప్రజలకు శుద్ధ జలం అందించడానికి ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందని మందస ప్రధాన రహదారి డబుల్ రోడ్డు బస్సు షెల్టర్ రోడ్డు మధ్యలో నిర్మించడం జరిగిందని పంచాయతీ నిధులతో ప్రధాన రహదారి మధ్యలో సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు తన ఐదేళ్ల కాలంలో పంచాయతీకి మంజూరు అయిన సుమారు రెండు కోట్ల 75 లక్షల రూపాయలతో పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని బోటేశ్వర పొందర సాహూ బ్రాహ్మణ దేవర కరణం కీళ్లమ్మ మాదిగ రజక శాసనం వీధుల్లోనూ సిమెంటు రోడ్లు డ్రైనేజీలు నిర్మించడం జరిగిందని చండేశ్వర అన్నపూర్ణమ్మ గ్రామ దేవత ఆలయాలకు సిమెంటు రోడ్లు నిర్మించడం జరిగిందని స్మశానానికి వెళ్లే రహదారికి సిమెంటు రోడ్డును నిర్మించడం జరిగిందని పంచాయతీ పరిధిలో మేఘమాల గిరిజన గ్రామానికి మినీ రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించడం జరిగిందని చిన్న బరంపురం గ్రామంలో కల్వర్టు సిమెంటు రోడ్డు తో పాటు మంచినీటి చెరువుకి రోడ్డు నిర్మించడం జరిగిందని ఆమె వివరించారు మార్కెట్ రోడ్డులో సిమెంటు రోడ్డు తో పాటు కల్వర్టు ను నిర్మించడం జరిగిందని చెత్త సంపద కేంద్రం లో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులను పంచాయతీలో నిర్మించడం జరిగిందని గ్రామపంచాయతీ కార్యాలయం ప్రాంగణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఆమె వివరించారు ఇంకా పంచాయతీలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ముఖ్యంగా కరణం వీధిలో సిమెంటు రోడ్లు డ్రైనేజీలు నిర్మాణ పనులు జరిగాయని ఆమె వివరించారు తన ఐదు సంవత్సరాల పాలనలో పంచాయతీలోని ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి తీర్మానాలు చేయడం జరిగిందని ఆమె తెలిపారు తనకు తన భర్త చెరుకుపల్లి లక్ష్మణరావు సంపూర్ణ సహకారాన్ని అందించారని ఆమె తెలిపారు ఈ ఐదు సంవత్సరాల పాలన కాలంలో పంచాయతీలోని అన్ని వర్గాల ప్రజలు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులు గ్రామపంచాయతీ ఉద్యోగులు సచివాలయం ఉద్యోగులు పూర్తిస్థాయిలో సంపూర్ణ సహకారాన్ని అందించారని తనకు సహకరించిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆమె అన్నారు

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**